ఆత్మీయ స్వాగతం



గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు అవార్డులు ఇచ్చే కార్యక్రమం శుక్రవారం విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ముఖ్యఅతిథి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి ఆత్మీయ స్వాగతం పలికారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సూరంపల్లిలో జరిగిన ర్యాలీలో కార్యదర్శి సురేష్‌బాబు, ఉద్యోగులు



బుద్ధవరంలో ర్యాలీలో అధికారులు, సిబ్బంది

గన్నవరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ పర్యావరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని దావాజీగూడెంలో పంచాయతీ, సచివాలయ, ఆరోగ్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ నియంత్రణపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. పర్యావరణానికి నష్టం కలిగించే ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను నియంత్రించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ సూరెడ్డి శ్రీమణి, పంచాయతీ కార్యదర్శి సత్యబాబు, జూనియర్ అసిస్టెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు. గన్నవరం గ్రామ పంచాయతీలో సర్పంచి నిడమర్తి సౌజన్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

గన్నవరం రూరల్: ప్లాస్టిక్ వాడకం ప్రాణాంతకమని మండలంలోని సూరంపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ జరిగింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజల భాగస్వామ్యంతో మిషన్ లైఫ్ ప్రచారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరిన సచివాలయం సిబ్బంది, పంచాయితీ కార్మికులు గ్రామంలోని వీధుల్లో ప్ల కార్డులు చేతబట్టి 'ప్లాస్టిక్ వాడొద్దు..ప్రాణాలు తీయొద్దు' అంటూ నినాదాలు చేశారు. గ్రామంలోని షాపులకు వెళ్లి క్యారీ బ్యాగులు అమ్మొద్దని చెప్పారు. సచివాలయం కార్యదర్శి శ్రీనివాస్, మాదలవారిగూడెం సచివాలయం కార్యదర్శి కేవీ రాజశేఖర్, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంకిపాడులో..

కంకిపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పలువురు అధికారులు పేర్కొన్నారు. పునాదిపాడు పంచాయతీ పరిధిలో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ చేశారు. ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ సచివాలయ సిబ్బంది నినాదాలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

యనమలకుదురులో భూ సర్వే



యనమలకుదురులో డ్రోన్‌తో భూసర్వే ప్రారంభిస్తున్న అధికారులు

పెనమలూరు: యనమలకుదురులో శుక్రవారం జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద భూ సర్వే ప్రారంభించారు. రైతులకు అవగాహన కల్పించి అత్యాధునిక పరికరాలు, డ్రోన్‌తో గ్రామంలో భూసర్వే చేస్తారు. గ్రామంలో భూవివరాలను భూయజమానులకు కచ్చితంగా తెలుపుతారు. గ్రామంలో భూమిని డ్రోన్‌తో సర్వే చేసి హద్దులు నమోదు చేయనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఉయ్యూరు డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ విజయవర్మ, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలటీ ఏసీపీ మురళీగౌడ్, సుబ్బారావు, టీపీఓ గిరి, రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్లు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన భూముల సర్వే

గన్నవరం రూరల్ : మండలంలోని వెదురుపావులూరు, సూరంపల్లి గ్రామాల్లో రెవెన్యూ, సర్వే బృందం ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే ప్రారంభించారు. ఈ గ్రామంలో ప్రభుత్వ భూములు, చెరువుల భూములు ఆక్రమణలలో ఉన్నాయని, వాటిని తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పలువురు స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా ప్రభుత్వానికి విన్నవించటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం ఎమ్మెల్యే వంశీ, తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు పర్యటించి వెదురుపావులూరు, సూరంపల్లి రెవెన్యూ గ్రామాల్లో ఆక్రమణలు ప్రాథమికంగా పరిశీలించారు. దీంతో శుక్రవారం మండల సర్వేయర్ మాధవరావు ఆధ్వర్యంలో ఎంఆర్ఐ ఉదయ్, పలువురు సర్వేయర్లు వెదురుపావులూరు భూముల్లో సర్వే నిర్వహించారు. తహసీల్దార్ నరసింహారావు మాట్లాడుతూ సర్వే రిపోర్టులను రోజువారి తీసుకుంటామని, ఎవరి ఆక్రమణలో ఎంత భూమి ఉందో గుర్తిస్తామని చెప్పారు. చెరువులను పూడ్చి ఆక్రమించిన పరిస్థితులను పరిశీలించి సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు.

క్లుప్తంగా

మహిళపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో మహిళపై జరిగిన దాడి జరిగిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ఎండీ జాకీరున్నీసా సనత్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఆటోనగర్ స్టీల్ కంపెనీలో పని చేస్తుంటారు. ఆమె భర్త జహంగీర్ కొన్నేళ్ల క్రితం మరణించాడు. ఇంటి పక్కన ఉన్న వారితో ఆమెకు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంటి పక్కన ఉండే అస్లం, దిల్‌షాద్‌బేగం, మన్సూర్, మరి కొందరు జాకీరున్నీసా ఇంటికి వచ్చి ఆమెపై దాడి చేశారు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

కల్యాణమస్తుతో పేదలకు చేయూత



కంకిపాడు: వైఎస్సార్ కల్యాణమస్తుతో పేద కుటుంబాలకు చేయూత లభిస్తుందని పునాదిపాడు పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు అన్నారు. పునాదిపాడులో వివాహం చేసుకున్న బంద్రపల్లి పద్మజ- వేల్పుల విద్యాసాగర్, బొడ్డు సంయుక్త-కంబాల రవి, సాగి మానసస్ఫూర్తి-ఉజ్జినేని వెంకట సత్య రాగేష్‌లకు వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద లబ్ధి చేకూరిందన్నారు. వారి అర్హతల ప్రకారం ప్రభుత్వం కల్యాణ మస్తు సొమ్ము జమ చేసిందని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రాధాకల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

రామాలయం స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో రామాలయం స్థలాన్ని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్ ఆక్రమించారని ఆరోపిస్తూ దేవస్థానం కమిటీ సభ్యులు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సగర్లు దాదాపు 20 ఏళ్ల క్రితం రామాలయం నిర్మించుకున్నారు. ఈ దేవస్థానానికి సరిహద్దు స్థలం కలిగిన టీడీపీ నేత గుండపనేని ఉమావరప్రసాద్ రామాలయం స్థలాన్ని ఆక్రమించడానికి యత్నించటంతో ఆలయ కమిటీ సభ్యులు గతంలో కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఉమావరప్రసాద్ శుక్రవారం మరోమారు రామాలయం స్థలాన్ని స్వాధీనం చేసుకుని, పశువులను కట్టివేయటంతో వివాదం రేగింది. దీనిపై రామాలయం కమిటీ సభ్యులు గజ్జల గోపాలం, కగ్గా రమణ, నక్కా వరలక్ష్మి, కర్నాటి సామ్రాజ్యం, గజ్జెల వాణి వీరవల్లి తదితరులు ఎస్ఐ చిరంజీవికి ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పును పరిశీలించిన తర్వాత ఘటనపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

బీజేపీ విధానాలతో ప్రమాదం

గన్నవరం: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సేవా సారథులు వలంటీర్లు

పెనమలూరు: సేవా సారథులు వలంటీర్లు అని అధికారులు కొనియాడారు. తాడిగడప మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఉత్తమ వలంటీర్లను ప్రభుత్వం ఎంపిక చేసింది. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు శుక్రవారం వివరాలు తెలిపారు. మున్సిపాలిటీలో ఐదుగురు వలంటీర్లకు సేవారత్న అవార్డులు వచ్చాయన్నారు. కానూరు 1 సచివాలయంలో కె.వసంత కోటేశ్వరరావు, సచివాలయం 2లో ఎండీ పర్వీన్‌సుల్తానా, సచివాలయం 5లో కె.సువర్ణ, పోరంకి సచివాలయం 1లో భాణావత్ తిరుమల, యనమలకుదురు 2 సచివాలయంలో షేక్ ఆస్మాలకు సేవా రత్న అవార్డులు వచ్చాయన్నారు. 502 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు వచ్చాయని తెలిపారు.

పెనమలూరు మండలంలో..

పెనమలూరు మండలంలో వలంటీర్లకు అవార్డుల పంట పండించారని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. సేవా వజ్రగా గంగూరు 2 సచివాలయానికి చెందిన వడ్డాది నాగలక్ష్మి, చావా సునీత ఎంపికయ్యారు. సేవారత్నగా చోడవరంలో చోడవరపు ధనలక్ష్మి, పెదపులిపాకలో గంధం శ్రీదేవి, వణుకూరు 2లో వణుకూరు వనజ, గోసాల2లో ఆంజనేయప్రసాద్, జంజనం శ్రీ లక్ష్మికి అవార్డులు ప్రకటించారు. మండల పరిధిలో 187 మందికి సేవారత్న అవార్డులు వచ్చాయి.

అవార్డులకు వలంటీర్ల ఎంపిక

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామం సచివాలయం-2లో వలంటీర్లగా విధులు నిర్వహిస్తున్న లేళ్ల నిరంజన్ (సేవా వజ్ర) తాటి గంగా భవాని (సేవా రత్న) అవార్డులకు ఎంపికయ్యారని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. వీరు గ్రామంలో ఉత్తమ సేవలను అందించడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హుల చెంతకు చేరవేయడంలో అంకిత భావంతో పని చేసినందుకు వీరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించనుంది. ఈ సందర్భంగా వలంటీర్లు నిరంజన్, తాటి గంగా భవానిలకు గ్రామ నాయకులు, ఎంపీడీవో, సచివాలయం కన్వీనర్లు, పంచాయతీ కార్యదర్శి, తోటి వలంటీర్లు అభినందనలు తెలిపారు. వీరికి నిర్ణీత తేదీన అవార్డులు ఇవ్వనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

ఏఆర్‌నగర్ సమస్యలు పరిష్కరిస్తా



పెనమలూరు: గంగూరులోని ఏఆర్‌నగర్‌లో సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని, తాను ప్రజలతోనే ఉంటానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గంగూరు ఏఆర్‌నగర్‌లో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే పార్థసారథి స్థానికులతో మాట్లాడారు. మంచినీటి పైప్‌లైన్ నాలుగు రోజుల్లో వేయిస్తానన్నారు. స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే స్పందించడంతో ఆ ప్రాంతవాసులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, ఏదో లోయ శివశంకర్, ఎంపీఓ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గోనె సంచుల పంపిణీ



రైతులకు సంచులు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ అంజనీకుమారి, ఎంపీపీ, జెడ్పీటీసీ

గన్నవరం రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గన్నవరం ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీ కుమారి అన్నారు. శుక్రవారం పురుషోత్తపట్నం ఆర్‌బీకే వద్ద ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎ.ఎలిజబెత్ రాణితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలు స్థానికంగానే అమ్ముకునేందుకు ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి భరోసా ఇచ్చిందన్నారు. మొక్కజొన్న కనీస మద్దతు ధరను క్వింటా రూ.1962 చేసిందన్నారు. రైతులు ఆర్‌బీకేలో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన గోనె సంచులను రైతులకు అందజేశారు. ఎంఏవో ఎస్ఎల్ తేజస్వి, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పామర్తి మాధవరావు, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నాగనబోయిన గిరీష్‌రాజ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్‌వీఆర్, రైతులు మాధవ సాంబశివరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం జ్ఞాన సాధనం



పురుషోత్తపట్నంలో..



క్యారమ్ బోర్డును అందజేస్తున్న రఘుపతిరావు

కంకిపాడు: పుస్తక పఠనం జ్ఞాన సాధనమని అతిథులు చెప్పారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం చిత్రలేఖనంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తికర చిత్రాలను గీసి అబ్బురపరిచారు. విద్యార్థులు కోహిల్, రాకేష్ కిరణ్.. బ్యాటరీ లైట్ తయారు చేసి ప్రదర్శించారు. శిక్షణ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు క్యారమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: పుస్తకాలు చదవడం జీవనంలో భాగం కావాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా విద్యార్థులను, బాలలను ఉంచాలని, పుస్తకాలకు దగ్గర చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యారమ్ బోర్డు బహూకరణ

ఉంగుటూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ నిమిత్తం ఉంగుటూరు గ్రంథాలయానికి దాతలు ఆట వస్తువులను బహూకరించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు ఎస్.రఘుపతి గ్రంథాలయానికి క్యారమ్ బోర్డును శుక్రవారం బహూకరించారు. గ్రంథాయాధికారి స్వర్ణలతకు అందజేశారు. క్యారమ్ బోర్డును గ్రంథాయానికి వచ్చే విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

పుచ్చలపల్లి చిరస్మరణీయుడు



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెనమలూరు: పీడిత ప్రజల కోసం పుచ్చలపల్లి సుందరయ్య నిస్వార్థ పోరాటం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. పోరంకిలో శుక్రవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు ఉప్పడ త్రిమూర్తి, పాతాళలక్ష్మి, పండమనేని శ్రీనివాసరావు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

వీఎల్ భవన్‌వద్ద జరిగిన కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్ కాశిం, మస్తాన్‌వలి, పల్లా పాపారావు, శ్రీరాములు, ఎస్‌కే బాబు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని బాపులపాడు మండలం బండారుగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు బర్రె లెనిన్, బొకినాల రాము పాల్గొన్నారు.

కంకిపాడు: కంకిపాడు, ఉప్పలూరు, జగన్నాథపురం, గొడవర్రు తదితర గ్రామాల్లో పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రంగారావు, మండల కార్యదర్శి తాడంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి శుక్రవారం విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపు ఇచ్చారు. పార్టీ స్థానిక శాఖ కార్యదర్శి గుంటక చిన వెంకటరెడ్డి, జీవి రంగారెడ్డి, పోలారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, బి. శివరాం, కె.శ్రీనివాసరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ పథకం వినియోగించుకోవాలి



ఉంగుటూరు: వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ఉచితంగా బోరుబావులు తవ్వుతున్నారని, అవసరమైన రైతులు సద్వినియోగించుకోవాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. నందమూరులో వైఎస్సార్ జలకళ ద్వారా బోరుబావి తవ్వకం పనులను ఎంపీపీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతుల సంక్షేమ అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మెట్ట భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో జలకళ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అవసరమైన రైతులు ఆన్‌లైన్‌లో, రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్‌డీ బాషా, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఎం టి.వినీల, టీఏ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

115 పరుగుల తేడాతో శక్తి సీసీ గెలుపు



శక్తి సీసీ జట్టు ఆల్‌రౌండర్ ఆర్యన్‌సాయికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: కేకే గ్లోబల్ క్రికెట్ టోర్నమెంట్ రెండో మ్యాచ్‌లో శక్తి సీసీ జట్టు తన ప్రత్యర్థి ప్లేయర్స్ ఎలెవన్ జట్టుపై 115 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. విజయవాడ శివారు యనమలకుదురులోని కేకే గ్లోబల్ క్రికెట్ అకాడమీ మైదానంలో శుక్రవారం జరిగిన వన్డే లీగ్ మ్యాచ్‌లో ఈ రెండు జట్ల మధ్య పోరు ఆసక్తికరంగా సాగింది. టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న శక్తి సీసీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలి ఇన్నింగ్స్‌లో 42.4 ఓవర్లకు 265 పరుగులు చేసి ఆలౌటయింది. బ్యాట్స్‌మన్లు ధీరు 47, కె.ఆర్యన్‌సాయి 44 పరుగులతో రాణించారు. రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి ప్లేయర్స్ ఎలెవన్ జట్టును శక్తిసీసీ బౌలర్లు 46.3వ ఓవర్ వద్ద 150 పరుగులకు కట్టడి చేశారు. శక్తి సీసీ బౌలర్లు ఆర్యన్‌సాయి, సాయిప్రకాష్, విఘ్నేష్ రెండేసి వికెట్లు తీశారు. 44 పరుగులు, రెండు వికెట్లు తీసిన శక్తిసీసీ జట్టు ఆల్‌రౌండర్ ఆర్యన్‌సాయి మ్యాన్ ఆఫ్ మ్యాచ్ ట్రోఫీని అకాడమి మేనేజర్ ఎస్.జానకీరామ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఇదే మైదానంలో నేడు కేకే గ్లోబల్, ప్లేయర్స్ ఎలెవన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన పేరిణి సందీప్ బృందం ప్రదర్శించిన పేరిణి నాట్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నిర్వహించిన ప్రదర్శనలో పలు కీర్తనలకు చక్కటి నాట్యంతో అలరించారు. బి.అపర్ణ, ఎం. ఇంద్రజ, ఎం. అభినయ, చిట్టి, మౌనిక, అక్షయ్‌లతో పాటు మరి కొందరు కళాకారులు తమ నాట్య ప్రతిభను ప్రదర్శించారు.

నిరుపేదలకు అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని తోచినంతలో సేవ చేయాలని బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్, జిల్లా వాకర్స్ క్లబ్ మాజీ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ శనగశెట్టి హరిబాబు సూచించారు. బావాజీపేట శ్రీ కృష్ణ దేవరాయలు విగ్రహం సమీపంలో శుక్రవారం బీఆర్‌టీఎస్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన దాత కళ్ళే పల్లి విజయ సహకారంతో నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నిరుపేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గుర్రం ఏడు కొండలు, ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, సభ్యులు గుర్రం లీలా కుమార్, పోతుల విల్సన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయంలో చండీ హోమం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అమావాస్య పురస్కరించుకుని శుక్రవారం పాల ప్రాజెక్టు సమీపంలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాలంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చన అనంతరం కుంకుమార్చనలు, అష్టోత్తర శతనామ పూజ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యం అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమాన్ని అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు.

ఆటో అపహరించిన వ్యక్తుల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాత్రి వేళలో ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ఆటోను అపహరించిన వ్యక్తులను వీరవల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపులపాడు మండలం ఎ.సీతారామపురానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ సలీం ఈ నెల 17వ తేదీన తన ఇంటి ఎదుట ఆటోను నిలిపి ఉంచాడు. తెల్లవారుజాము వేళ గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి ఆటోను అపహరించుకుని వెళ్లినట్లుగా షేక్ సలీం వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆటో దొంగలించిన తేలప్రోలు గ్రామానికి చెందిన తోట కనకరావు, అతని కుమారుడు కేశవర్ధన్, ఏలూరుకు చెందిన షేక్ అహ్మద్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.